విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 6, నవంబర్ -2025 8 పేజీలు

ఏసీబీ దాడితో దద్దరిల్లిన రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం..

రూములకు తాళాలు వేసుకొని పరారైన స్టాంప్ రైటర్లు ఉదయం నుండి కొనసాగిన సోదాలు..

విశాలాంధ్ర -రాజంపేట: సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 120 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఏసిబి అధికారులు సోదాలు చేపట్టారు. అందులో భాగంగానే పార్లమెంట్ కేంద్రమైన రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుండి ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రధానంగా గత కొంతకాలం నుండి రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి భారీ స్థాయిలో జరుగుతోందని పత్రికల్లో కూడా కథనాలు వెలుపడ్డాయి. దీనికి తోడు ఇక్కడ జరుగుతున్న అవినీతిపై అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ భూములను అడ్డదిడ్డంగా రిజిస్ట్రేషన్లు చేయడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. 2లో

వైద్య పరికరాల కోసం రూ. 3.5 కోట్ల ప్రతిపాదనలు ఆమోదం : కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని.. మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్.డి.ఎస్. ఛైర్మెన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సభ్యులను ఆదేశించారు.బుధవారం రిమ్స్ ప్రభుత్వ వైద్యకళాశాల బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్, జిజిహెచ్ హెచ్ డీఎస్ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగిన 51వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, కడప నగర కమీషనర్ మనోజ్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.కె.నాగరాజు,తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ప్రజా స్పందనలలో కడప జిజిహెచ్ మంచి ప్రతిభ కనపరిచినందుకు డాక్టర్లను అభినందించారు. జిజిహెచ్ లో అన్ని విభాగాల్లో డాక్టర్లు ఉన్నారని ప్రజలకు మంచి ఆరోగ్య సేవలు అందించాలన్నారు.అలాగే క్రింది స్థాయి సిబ్బంది రోగుల దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా.. ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై కూడా దృష్టి సారించాలన్నారు.జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి.. కేవలం జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలు ప్రతి 2లో

రూ.300 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి అందిస్తాం : మంత్రి మండిపల్లి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : రూ.300 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు తాగునీటి అందిస్తామని రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి మండల పరిధిలోని కస్తూరిరాజుగారి పల్లె పంచాయతీ దేవలంపల్లిలో మాజీ డిసిసిబి డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెదేపా కార్యకర్తల ఆత్మీయ సమావేశ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం చాగల గుట్టపల్లిలో వెలసిన గంగమ్మ ఆలయంలో అమ్మవారికి, దేవలంపల్లెలో కొలువై ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సభలో మాట్లాడుతూ రూ.300 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు త్వరలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా చిన్న మండెంలో శంకుస్థాపన కార్యక్రమం చేపడతా మన్నారు. 2027 సంవత్సరం నాటికి రాష్ట్రంలో రాయచోటి నియోజకవర్గాన్ని జల్జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య ఎప్పటికీ తలెత్తుకుండా చూస్తామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మొదటిసారిగా రాయచోటి నియోజకవర్గానికి జలజీవన్ పథకం తీసుకొస్తున్నామన్నారు.854 గ్రామాలకు గానూ శాశ్వతంగా 300 ట్యాంకులను ఏర్పాటుచేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం శ్రీకారం చూపుతానన్నారు. అలాగే రోళ్ళమడుగు నీటిని ఆ ఏరియాలో 50 గ్రామాలకు నీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. వైకాపా ప్రభుత్వంలో వెలిగల్లు నీటిని గ్రామాలకు సరఫరా చేసేందుకు సక్రమంగా కాలువలు తీయకనే రాయచోటి నియోజకవర్గ రైతాంగానికి నీటి సమస్య ఏర్పడిందన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద 25 వేల ఎకరాల కు సాగునీరు అందుతుందన్నారు. రూ. 400 కోట్లతో శ్రీనివాస పురం మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ కు టెండర్లు పిలిచారనీ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏ పని మొదలుపెట్టిన పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపించి ప్రతి పని పూర్తి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలలకే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 175 నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అన్నారు. గతంలో అనంతపురం జిల్లాలో కంపెనీ మంజూరు అయితే దానిని జగన్ మోహన్ రెడ్డి వినియోగించుకోకపోవడంతో బెంగళూరుకు తరలి వెళ్ళిపోయిందన్నారు.కొన్ని రాష్ట్రాల్లో పింఛన్ రూ.200 ఇస్తుంటే మన రాష్ట్రంలో రూ. 4000 నుంచి రూ. 15000 వరకు పింఛన్ పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది అన్నారు. ఈ పింఛన్ పంపిణీ చేస్తుండడంతో పింఛన్దారుల మొహంలో ఆనందం చూస్తున్నామన్నారు.

ఈకార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మదన్మోహన్, ఎర్రగొల్ల రెడ్డయ్య యాదవ్, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, షఫీ నాయక్, సింగిల్ విండో ప్రెసిడెంట్ దేవేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, మండల మైనారిటీ యువనాయకుడు షేక్ ఆరిఫ్ మాజీ ఎంపీటీసీ రాజేంద్రరెడ్డి, యాగంటి పాపయ్య, యాగంటి సుధీర్, దండే శ్రీనివాసులు, యలమకూరి విజయ భాస్కర్, సిద్దక వెంకట్రాంరెడ్డి తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ. 6,28,000-00 నగదు, 8 సెల్ ఫోన్ లు, 4 బ్యాంక్ పాస్ బుక్స్ స్వాధీనం జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్,

విశాలాంధ్ర-కడప : ప్రొద్దుటూరు పట్టణం యందు క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్యకలాపాల గురించి డిఎస్పీ పి భావన మరియు ఇన్స్పెక్టర్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 3వ తేదీన చాపాడు మండలం చిన్న గురవలూరు గ్రామానికి చెందిన పెదమల్ల జగన్ అను నతను, తన ద్వారా బెంగుళూరు కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా వాళ్ళు ఆన్లైన్ ట్రేడింగ్ కొరకు తమకు కరెంట్ అకౌంట్లు కావాలని చెప్పి తన ద్వారా వివిధ బ్యాంక్ లలో కరెంట్ అకౌంట్లు ఓపెన్ చేయించారు. తద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ వుండి, అవి ఫ్రీజ్ కాగా మరిన్ని అకౌంట్లు కావాలని అడుగగా అందుకు ఫిర్యాది సహకరించనందున అతని పై దాడి చేసి అతని ఎటిఎం కార్డు లాక్కొన్నారు. ప్రొద్దుటూర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో బెంగుళూరులో పిజి నడుపుతున్న, 2లో

రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక శిబిరాలు :కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర - నందలూరు : రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకోసమే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నందలూరు మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం లో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మూడు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం 2లో

రాచమల్లు రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర-పొద్దుటూరు: మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ కు సంబంధించిన కోటి రూపాయలు మున్సిపల్ ఖజానాకు జమ చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యేకు వైఎస్సార్ టీయూసి పట్టణ అధ్యక్షులు, 34వ వార్డు ఇంచార్జ్ షేక్ ఖాజాపీర్ పేరు పూలమాల వేసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రాచమల్లు ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాధనాన్ని కాపాడాలన్న ఆశయంతో ఈ రిలే దీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి అనుచరులు కాబట్టే కోటి రూపాయలు మున్సిపల్ ఖజానాకు జమ చేయకుండా ఎగరగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 2014-19లో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఆ 5 సంవత్సరాలు మున్సిపల్ ఖజానాకు గండి కొట్టారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా 2 సంవత్సరాలు కరోనా కాలంలో ఎగ్జిబిషన్ నిర్వహించలేదన్నారు. రెండు సంవత్సరాలు ఎంట్రీ ఫీజు లేకుండా ప్రజలకు ఉచితంగా ప్రవేశాన్ని కల్పించామన్నారు. ఒకసారి నేను ఎంట్రీ ఫీజు కట్టినాను అని, కౌన్సిల్ తీర్మానం మేరకు ఒకసారి ఎంట్రీ ఫీజు లేకుండా 2లో

వైద్య పరికరాల కోసం రూ. 3.5 కోట్ల ప్రతిపాదనలు ఆమోదం : కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

(మొదటి పేజీ తరువాయి)

నిత్యం ఆరోగ్య రక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని.. మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్.డి.ఎస్. సభ్యులకు సూచించారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులో వున్నాయన్నారు. అనంతరం.. జిజిహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, రిమ్స్ ఎస్డీసీ,డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, జిఎంసి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున,జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, సిఎస్ ఆర్ఎంఓ డా.వై. శ్రీనివాసులు, ఐఎంహెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వెంకట్రాముడు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, ఏపీ ఎంఎస్ఐడీసీ ఇఇ ఎ. వెంకటేశ్వర రెడ్డి, ఏపీ వివిపి డిసిహెచ్ఎస్ డా.వై. హిమదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట రమణమ్మ, తదితర హెచ్.డి.ఎస్. సభ్యులు, అన్ని విభాగాల వైద్యాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం..

(మొదటి పేజీ తరువాయి)

గతంలో కూడా ఏసీబీ అధికారులు రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ప్రధానంగా స్టాంపు రైటర్లు, అధికారులు కుమ్మక్కై భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దాడి చేయడంతో స్టాంపు రైటర్లు రూములకు తాళాలు వేసుకుని పరారయ్యారు. ఉదయం నుండి కొనసాగుతున్న సోదరులపై మీడియా ప్రతినిధులు ఏసీబీ అధికారులను వివరణ కోరగా రికార్డును తనిఖీ చేస్తూ.. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. ఈ దాడిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరారైన స్టాంపు రైటర్లు...

మూడు పువ్వులు ఆరు కాయలుగా.. రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ కళకళలాడుతున్న స్టాంప్ రైటర్లు ఒక్కసారిగా ఏసీబీ అధికారులు తనిఖీకి రావడంతో షాక్ కు గురయ్యారు. వెంటనే వారి బాగోతాలు బయటపడతాయని రూములకు తాళాలు వేసుకొని పరారయ్యారు. నిబంధనల ప్రకారం 200 మీటర్లు అవతల స్టాంపు రైటర్లు ఉండాలి. కానీ అవేమి పట్టించుకోకుండా దర్జాగా కార్యాలయం చుట్టుపక్కల ఉన్నటువంటి రూములను అద్దెకి తీసుకొని జోరుగా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరిపై కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రొద్దుటూర్ మండలం లింగాపురం గ్రామానికి చెందిన వీర శంకర్, చంద్ర అనువారు వెబ్ సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించారు. సదరు వెబ్ సైట్ ద్వారా బెట్టింగ్ లావాదేవీలకొరకు బ్యాంక్ అకౌంట్లు అవసరం అయినందున, పై వీర శంకర్, చంద్ర అనువారు తాము నిర్వహిస్తున్న అక్రమ బెట్టింగ్ వ్యవహారాన్ని తమకు తెలిసిన, ఇపుడు పట్టుపడిన చెన్న కృష్ణ, నరేంద్ర, మేరువ హరి, సుధీర్ కుమార్ రెడ్డి, కృష్ణా రెడ్డి, రవి తేజ అనువారి ద్వారా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించుకొని వారికి కమిషన్లు ఇస్తూ వారి ద్వారా విస్తృతముగా ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలోన పై వ్యక్తులు మొత్తం 16 బ్యాంక్ అకౌంట్ల ద్వారా పై క్రికెట్ బెట్టింగ్ కు చెందిన అక్రమ లావాదేవీలు చేసినట్లు తేలినది, సదరు అన్ని బ్యాంకిలకు అకౌంట్లు ట్రాన్సక్షన్స్ పొందుపరచమని సంబంధిత బ్యాంక్ వారిని కోరారు. ప్రస్తుతానికి బ్యాంకిల ద్వారా తెలిసిన సమాచారం మేరకు పై బెట్టింగ్‌కు సంబంధించిన రూ. 8.7 లక్షల రూపాయలు ఫ్రీజ్ అయివున్నాయి. ఇలా అనుమానాస్పద లావా దేవిలు జరిపిన అన్నీ అకౌంట్లను ఫ్రీజ్ చేయమని ఆయా బ్యాంకులను కోరడమైనది. పై ముఠా గురించి కచ్చితమైన సమాచారం రాగా ఈ దినం అనగా 5-11-2025 ఉదయం పై కేసులోని 6 మంది ముద్దాయిలను ప్రొద్దుటూరు లో అరెస్టు చేసి వారి వద్ద నుండి 8 సెల్ ఫోన్లు అక్రమ లావా దేవిలకు వాడిన 4 బ్యాంక్ పాస్ బుక్కులు, ఇటీవల జరిగిన ఇండియా-ఆస్ట్రేలియా, మహిళల ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ల సంధార్భముగా నిర్వహించిన బెట్టింగ్ కు సంబంధించిన రూ 6.28 లక్షల రూపాయల నగదు స్వాధీనము చేసుకున్నారు. పై క్రికెట్ బెట్టింగ్ ముఠాల కార్యకలాపాలను గుర్తించి వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెట్టుటలో ప్రతిభ కనపర్చిన ప్రొద్దుటూర్ డిఎస్పీ పి భావన, 2 టౌన్ యు. సదా శివయ్య, ప్రొద్దుటూర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఎం. నాగ భూషణ్, ఎస్సైలు , జె. ధనుంజయుడు, కె. రాఘవేంద్ర రెడ్డి మరియు వారికి సహకరించిన వారి సిబ్బందిని ప్రత్యేకముగా అభినందించి వారికి తగు రివార్డుల కొరకు సిఫార్సు చేశారు. అరెస్టు కాబడిన వ్యక్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్ల చెన్న కృష్ణ లింగాపురం గ్రామము, ప్రొద్దుటూర్ మండలం, దగదారి నరేంద్ర, కాలనీ ప్రొద్దుటూర్ మేరువ హరి, ఈశ్వర్ రెడ్డి నగర్, ప్రొద్దుటూర్ ఇల్లూరి సుధీర్ కుమార్ రెడ్డి, నెహ్రూ రోడ్ ప్రొద్దుటూర్‌పళ్లపోతుల కృష్ణా రెడ్డి, మోడమ్ పల్లె, ప్రొద్దుటూర్ సత్నా రవితేజ, దొరసానిపల్లి, ప్రొద్దుటూర్ మండలం. ముఖ్య నిర్వాహకులైన పరారీలో వున్న వీర శంకర్, చంద్ర లను అరెస్టు చేయుటకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

నిరు పేదలకు సేవలందించాలి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ప్రభుత్వ న్యాయవాధిగా నియమితులైన న్యాయవాది రమణ నిరుపేదలకు అందుబాటులో ఉంటూ సేపలు అందించాలని స్థానిక మాలమహానాడు, బీసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదిగా పనిచేస్తూ, ఏజీపీగా బాధ్యతలు చేపట్టిన జి.రమణకు ఆయాసంఘాల నాయకులు పూలమాల వేసి శాలువ కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య, వాయల్పాడు రెడ్డెప్ప, బీవీ రమణ, నరసింహులు, రెడ్డెప్ప, బీసీ నాయకులు సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు..

ప్రభుత్వాస్పత్తిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి

విశాలాంధ్ర - చిట్వేలు : చిట్వేలి మండలంలో ఎప్పటినుండో పాత భవన తో ఇబ్బందులు పడుతున్న ఆరోగ్య శాఖ ఎట్టకేలకు నూతన భవనం ప్రారంభానికి నోచుకుంది. బుధవారం, లాంచనంగా ప్రారంభానికి హంగులు దిద్దుకుంది. మూడు రోజులపాటు కష్టపడి కూటమి నాయకులు రాజకుంట నరసింహ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజలందరికీ ఆధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రాధాన్యతని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ , నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిట్వేల్ లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భావన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ , ఇంచార్జ్ రూపానంద రెడ్డి, తో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ న నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రజల అవసరాన్ని ఉంచుకొని నూతన భవనంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆరోగ్యం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని అవసరాలు పర్యవేక్షిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఎదురైనా అండగా నిలబడతామని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్ ఇంచార్జ్రూపానంద రెడ్డి మాట్లాడుతూ చిట్వేలి మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో అన్ని అవసరమైన వసతులు ఆస్పత్రిలో ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని సదుపాయం కల్పించి దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయి వికాస్ రెడ్డి, సర్పంచ్ దండు లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి, డీసీఎం చైర్మన్ జయప్రకాష్, పాటూరు శ్రీనివాసుల రెడ్డి,మాదాసు నరసింహ, బొంతల నాగేశ్వరరావు, ఉప్పలపాటి శివరాజు, గొబ్బిల చెంగల్ రాయుడు, ఎమ్మార్వో స్పందన రెడ్డి,ఎంహెచ్ఓ లక్ష్మీ నరసయ్య, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ శేఖర్, పిహెచ్సి వైద్యులు డాక్టర్ అన్సారి, డాక్టర్ సల్మా, ఎంపీడీవో శ్రీనివాసులు, సిఐ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు,కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శిబిరం విజయవంతం.

విశాలాంధ్ర-ములకలచెరువు: ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన సేవలు అందించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యం. సబ్ కలెక్టర్ స్వయంగా తంబళ్లపల్లె మండల కేంద్రానికి వెళ్లి, స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజల సమస్యలు, ఫిర్యాదులు నేరుగా విన్నారు. ఈ శిబిరంలో మొత్తం 107 సేవలు ప్రజలకు అందించబడ్డాయి. వాటిలో ముఖ్యమైన సేవలు ౦ సంయుక్త ఎల్‌పిఎమ్ విభజన, పోజెషన్ సర్టిఫికేట్లు, మ్యూటేషన్ లావాదేవీలు, సవరణల మ్యూటేషన్, జననం మరియు మరణం ఆలస్య రిజిస్ట్రేషన్, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఆర్థికంగా బలహీన వర్గాల సర్టిఫికేట్లు ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను జిల్లా కార్యాలయానికి వెళ్లకుండానే, మండల కేంద్రంలోనే పరిష్కరించుకునే అవకాశం లభించింది. ప్రజలు ఈ సౌకర్యంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి శిబిరాలు తరచుగా నిర్వహించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని పెంపొందించడం మరియు సేవల పంపిణీని వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రతి మండలంలో కూడా ఇలాంటి శిబిరాలను కొనసాగిస్తాం అని తెలిపారు. ఈ శిబిరం ద్వారా ప్రజలతో పరస్పర సంబంధం బలోపేతం అవడంతో పాటు, మండల స్థాయి రెవెన్యూ వ్యవస్థపై విశ్వాసం మరింతగా పెరిగింది.

గైడ్ కెప్టెన్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డిఈఓ సుబ్రమణ్యం

విశాలాంధ్ర-రాయచోటి: పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై ఇచ్చే శిక్షణను గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం సూచించారు. రాయచోటిలోని డైట్ నందు సోమవారం నుండి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా గైడ్ కెప్టెన్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం స్కౌట్ నందు నిర్వహించవలసిన కార్యక్రమాలపై విద్యార్థులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులలో దేశభక్తిని, సేవా భావాన్ని, నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక శిబిరాలు :కలెక్టర్ నిశాంత్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పి.జి.ఆర్.ఎస్ కు అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జిల్లా వ్యాప్తంగా రాజంపేట, మదనపల్లి, రాయచోటి మూడు డివిజన్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు ఏ స్థితిలో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై స్పష్టత సాధించడం, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా వినడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ కార్యక్రమంపై దృష్టి సారించి, ప్రతి శాఖ విభాగాధికారికి ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, ఖచ్చితత్వం, పారదర్శకతను పాటించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజలకు ప్రభుత్వం రెవిన్యూ సేవలను మరింత చేరువ చేయడమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, తాసిల్దార్ అమరేశ్వరి, ఎంపీడీవో కే ఆర్ ఎం ప్రసాద్, ఈ ఓ ఆర్ డి సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు రిలే నిరాహార దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తే లోపల అధిక రేట్లు పెట్టామని విమర్శించారన్నారు. నేడు మున్సిపల్ గెజిట్ ప్రకారం పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 వసూలు చేయాల్సి ఉండగా రూ. 100 ఎంట్రీ ఫీజు వసూలు చేయడం పట్ల ఎగ్జిబిషన్ నిర్వాహకుల వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో అర్థం అవుతుందని అన్నారు. మున్సిపల్ ఖజానాకు జమ చేయాల్సిన డబ్బును ఎగ్జిబిషన్ నిర్వాహకులు 40శాతం, ఎమ్మెల్యే మరియు ఆయన తనయునికి 60 శాతం తీసుకొని మున్సిపల్ ఖజానాకు గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రిలే దీక్షలో వైస్ చైర్మన్ సి.ఎస్ ఖాజా, వైఎస్సార్ టీయూసి పట్టణ అధ్యక్షులు ఖాజాపీర్, కౌన్సిలర్లు వరికూటి ఓబుల్ రెడ్డి, మన్నే సత్యం, రామేశ్వరం ఎన్.నాగరాజుతో పాటు వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కమీషనర్ పై చర్యలు తీసుకోవాలి-ఇర్ఫాన్ బాషా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎగ్జిబిషన్ నిధుల వసూళ్లలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ ఎస్.ఇర్ఫాన్ భాష రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కి మున్సిపల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు, అలాగే మున్సిపాలిటీకి రావలసిన రుసుము బకాయిల విషయాన్ని పొందుపరుస్తూ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ భాష మాట్లాడుతూ ఎగ్జిబిషన్ టెండర్ మొత్తం రెండు కోట్ల 25 లక్షలు కాగా ఇప్పటివరకు కేవలం 1కోటి 46 లక్షల రూపాయలు మాత్రమే ఎగ్జిబిషన్ నిర్వాహకుల వద్ద నుండి వస్తువులు చేయబడ్డాయని, మిగిలిన దాదాపు 79 లక్షల రూపాయలు బకాయిలపై మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్య తీసుకోకపోవడం అనుచితమని ఆయన అభిప్రాయపడి ఆవేదన వ్యక్తం చేశారు.బకాయిలు వసూలు చేయటంలో జాప్యం నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ కమిషనర్ పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇర్ఫాన్ భాష కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

జన సైనికుల అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: శివుడికి అత్యంత ప్రీతి అయిన కార్తీక పౌర్ణమి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో శివాలయం సెంటర్ లో జన సైనికులు నాగేంద్ర రాయల్, డాక్టర్ హరీష్, అశోక్ రాయల్, లక్ష్మణ్ సింగ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విఎస్ ముక్తియార్, జనసేన నాయకులు మాదాసు మురళీ, రామారావు, జిలాన్ బాషాలు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

విశాలాంధ్ర-కలికిరి : పట్టణంలో కాపురముంటున్న బి కృష్ణవేణి తన భర్త బి.సుబ్బనారాయణ రావు జ్ఞాపకార్థం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వడ్డిపల్లి ఆఫ్ కలికిరికి రూ.22వేల విలువచేసే కంప్యూటర్‌ను ఎంఈఓ నాగార్జున చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర రావుకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ ,అంగన్వాడీ కార్యకర్త అశ్విని, ఆయా జీవిత,ఎస్ఎంసి సభ్యులు చంద్ర సుమతి శ్రీనివాసులు రెడ్డమ్మ, రెడ్డప్ప వెంకటేష్, హాజరయ్యారు.

10న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గాలివీడు : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ చంద్ర మౌళీశ్వర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం సభా భవనంలో జరగబోవు ఈసమావేశానికి ప్రజా ప్రతినిధులు,మండల అధికారులు హాజరు కావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి: ఏఓ రమేష్

విశాలాంధ్ర - లింగాల :మండలంలోని కోమనూతల గ్రామంలో 'రబీ సీజన్ పొలం పిలుస్తుంది' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ రైతులు అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడంతో నేల నాణ్యత తగ్గిపోతోందని, ప్రకృతి కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయ నాయక్ అరటి పంటలో ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానం గురించి రైతులకు వివరించి, ప్రత్యక్ష ప్రదర్శన (డెమో)నిర్వహించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ అధికారి నగేశ్ పశువైద్య సహాయకుడు వల్లిప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి జయ నాయక్ రైతు సేవా కేంద్ర సిబ్బంది హరి, శిల్పా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిది పేదలకు వరం

విశాలాంధ్ర - బద్వేలు : కలసపాడు మండలం రాజుపాలెంకు చెందిన పోకల మల్లికార్జున రెడ్డికి బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రా రెడ్డి చేతుల మీదుగా రూ.35వేల చెక్కును అందజేశారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని వారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్య రీత్యా చికిత్స పొందిన వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి..ఆర్‌డిఓకు గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : మండల పరిధిలోని రంగసాయిపురం గ్రామంలోని సుమారు 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందంటూ ఆ గ్రామానికి చెందిన పలువురు బుధవారం జమ్మలమడుగు ఆర్‌డిఓ కార్యాలయంలో అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ స్థలంలో దశాబ్దాలుగా మహిళల మరుగుదొడ్డి కొనసాగింది. అయితే ఇటీవలి కాలంలో సదరు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకొని చదును చేసిన నేపథ్యంలో గ్రామస్తులు తొలుత మండల తహసిల్దారుకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఏకంగా ఆర్‌డిఓ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఏవో కు వినతి పత్రం సమర్పించారు. స్థల ఆక్రమణదారుడు ఆర్థికంగా సంపన్నుడని ఆ వినతి పత్రంలో గ్రామస్తులు గుర్తు చేశారు. ఆక్రమణ దారుడి నుండి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు పేద ప్రజల ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించాలని వినతి చేశారు. ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా సొంతం చేసుకొనే ప్రయత్నం ఏమిటని గ్రామస్తులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని స్వాధీన పరుచుకోవాలని వారు కోరుతున్నారు.

రహదారి భద్రత పై అవగాహన..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన విధానాలపై ఎర్రగుంట్ల పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రజలను సమావేశపరిచి సిఐ విశ్వనాథరెడ్డి రహదారి భద్రత అంశంపై అవగాహన కల్పించారు. వాహనదారులు విధిగా షీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించడంద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుండి బయటపడాలని సిఐ సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు తమ వంతు సహకరించాలని విశ్వనాథ్ కోరారు. అతివేగం సురక్షితం కాదని సిఐ ఉద్బోధించారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని విశ్వనాధ్ గుర్తు చేశారు. వాహన చోదకులు తమ కుటుంబాలను గుర్తు చేసుకుంటూ సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని సిఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగ మురళితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానం కార్తీక దీపోత్సవం

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ఎర్రగుంట్ల ప్రాంతంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. కార్తీక పౌర్ణమి లేదా కార్తీక పున్నమ పేరుతో కార్తీక మాసంలో పున్నమి తిథి రోజున ఈ పౌర్ణమి వేడుక జరగడం అనాదిగా సాంప్రదాయ బద్ధంగా వస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక కడప రోడ్డులోని మహేశ్వరానగర్‌లో కొలువుదీరిన శ్రీ ఉమామహేశ్వరుడి కళ్యాణం కన్నుల పండువలా జరిగింది. అనంతరం జరిగిన జ్వాలా తోరణం కార్యక్రమం భక్తులను కనువిందు చేసింది. ఆలయ అర్చకులు అయ్యలూరు కిరణ్ కుమార్ శర్మ సారథంలో ఘనంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణోత్సవానికి అవసరమైన పుష్పాలను ప్రత్యేకంగా తెప్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాటు చేసింది.

యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ను కలిసిన "ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయ "ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను "పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం. వి. రామచంద్రారెడ్డి" మర్యాదపూర్వకంగా కలిశారు. వైవియూకు వచ్చిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆచార్య రాజశేఖర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెళతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యా రంగ ప్రజాప్రతినిధిగా మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఉమ్మడి మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మానస పుత్రిక అయిన వైవియు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తుకు తెచ్చారు. విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన పరంగా ముందుకు వెళుతోందని సంతోషం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో "హెల్త్ సెంటర్ నిర్మాణాలను పూర్తిచేసి అందు బాటులోకి తీసుకు రావాల్సి ఉందన్నారు. అలానే అకడమిక్ కన్సల్టెంట్లకు "110 జీవోను ఇంప్లిమెంట్" చేయాలని తెలిపారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు - డిప్యూటీ తహశీల్దార్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : 'దేశ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గల్లా రమణ పేర్కొన్నారు.జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం కెబుడుగుంటపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు అందరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రశ్నించే హక్కు వస్తుందన్నారు. సమాజంలో మార్పు తీసుకొచ్చే సత్తా విద్యార్థులకే ఉందన్నారు. నవసమాజ స్థాపనకు ఓటే మార్గం అన్నారు.ఇంఛ్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి రమేష్ మాట్లాడుతూ ఓటు నమోదు చేసుకుంటే భవిష్యత్తు తరాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. డిప్యూటి తహశీల్దార్, ఇంఛార్జి ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఓటు నమోదు పత్రాన్ని అందజేసి పూరించే విధానాన్ని వివరించారు.ఈ సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దాసరి మోషే, లెక్చరర్లు జి శ్రీనివాసులు,డి వెంకటేశ్వర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

పేదప్రజలకు విద్య, వైద్యం దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు : పేద ప్రజలకు విద్య, వైద్యం దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18నెలలు కావస్తున్నా ప్రజలకు ఏ హామీ పూర్తి చేయలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో 17 మెడికల్ కాలేజీలు జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించి 7 కాలేజీలు పూర్తి చేసి మిగిలిన వాటికి పనులు చేయడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి పేద ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. కమీషన్ల కోసమే చంద్రబాబు నాయుడు ప్రైవేటుపరం చేసి కోట్లరూపాయలు దండుకునే పన్నాగం పన్నాడన్నారు.ఎద ప్రజల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మెడికల్ సీట్లు తెచ్చుకునే పరిస్థితి లేదన్నారు. వైద్యం కూడా సామాన్యులకు దూరం చేయడమే ఆయన ముఖ్యఉద్దేశ్యమన్నారు. ప్రజలతో మమేకమే కోటి సంతకాల సేకరణను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టారని ఏ గ్రామం వెళ్లినా అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో

కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు భాగ్యమ్మ, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, యువ నాయకులు పేరుసాముల నిత్యపూజయ్య, నీలం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సొంటం నారాయణరెడ్డి, గుమ్మళ్ల సాయికుమార్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు అన్వర్ హుసేన్, అబ్దుల్ రబ్, కోఆప్షన్ మెంబర్ వారీష్, ఆరవేటి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ నాగిరెడ్డి, చంద్ర, దేవగుడి భాస్కర్‌రెడ్డి, చిన్నబాబు, హరి, చల్లా వెంకటసుబ్బారెడ్డి, పండుబాయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్పి

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : కలమల్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం జమ్మలమడుగు డి.ఎస్. పి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిడి ఫైళు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన డి.ఎస్.పి వారు పర్యవేక్షిస్తున్న గ్రామాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి మార్గదర్శక సలహాలు ఇచ్చారు. అనంతరం ఆర్‌టిటిపి చేరుకొని సంబంధిత సిబ్బందికి నిర్వహణ (మెయింటెనెన్స్) భద్రత (సేఫ్టీ) అంశాలపై సూచనలు ఇచ్చారు. రికార్డుల నిర్వహణ, స్టేషన్ ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన డి.ఎస్.పి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతకుముందు పరిధిలోని పలు అంశాలపై స్టేషన్ ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి తో డి.ఎస్.పి చర్చించారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-గాలివీడు : మండలం గోరాన్ చెరువు కాస్పాలో పుడమి తల్లి బయోరీసోర్స్ సెంటర్‌ను యం. స్వాతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ అధికారి గౌతమి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందులు అధికంగా వాడటం వలన నేల సారవంతం తగ్గిపోతోందన్నారు. బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం, దశపర్ణి కషాయం వంటి నేచురల్ మందులు పంటలను కాపాడడమే కాకుండా ఖర్చులు తగ్గిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదమ్మ, స్వాతి, అంజనమ్మ, నాగేశ్వరి, గంగాదేవి, సుజిని, కృష్ణవేణి, మల్లీశ్వరి, నాగరాణి పాల్గొన్నారు.

వ్యక్తిపై యాసిడ్ దాడి

విశాలాంధ్ర -రాజంపేట : రాజంపేట మండల పరిధిలోని అత్తిరాల గ్రామంలో మన్యం రవి అనే వ్యక్తిపై బుధవారం కొంతమంది వ్యక్తులు యాసిడ్ తో దాడి చేసి గాయపరిచారు. వివరాలకు వెళ్తే... ప్రకాశం జిల్లా రాజపూడి గ్రామానికి చెందిన మన్యం రవి ఆరు సంవత్సరాల క్రితం అత్తిరాలకు చెందిన సుబ్బరత్న అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటినుండి అతనిపై అమ్మాయి తరఫు బంధువులు గతంలో రెండుసార్లు దాడి చేసేట్లు తెలిపాడు. ఇందులో భాగంగానే నేడు కూడా తన కక్ష సాధించేందుకు తనపై దాడి చేశారని రవి తెలిపాడు. అయితే ఆ వ్యక్తి అత్తిరాల గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపాడు. తన భార్య ఆటోలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చిందని వైద్యులు చికిత్స అందించారని తెలిపాడు.ఈ విషయంపై మన్నూరు సిఐ ప్రసాద్ బాబు కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు దాడి చేసిన వారిని గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ మున్సిపాలిటి 12వ వార్డు శివానగర్ నగర్ పరిధిలో ప్రస్తుత కూటమి ప్రభుత్వము కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ నిర్ణ యాన్ని వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గోవిందరెడ్డి ఎమ్మెల్సీ ఎమ్మెల్యే సుధా సూచనల మేరకు పట్టణాధ్యక్షులు సుందర రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు మురళి, ఖాదర్ ఖాన్, కౌన్సిలర్ రెడ్డెమ్మ, రమణ రాయల్, వాలంటీర్స్ వింగ్ ప్రెసిడెంట్ వెంకట సుబ్బయ్య, గుర్రయ్య, లక్ష్మీ నరసయ్య, మడికల రమణ, బాలయ్య, దస్తగిరి, బీబీ చాన్, రంతుల్లా, పాల్గొన్నారు.

'బుడ్డా' జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రేనాటి చంద్రునిగా ప్రసిద్దిగాంచిన మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవితం నేటి యువతరానికి ఆదర్శనీయమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష అన్నారు. బుడ్డా జీవితంపై రూపొందించిన వీడియోను బుధవారం కళాశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సలీంబాష విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 1866లో సంభవించిన భయంకరమైన కరువులో తిండికి లేక రాయలసీమలో వేలాది మంది ఆకలి చావులకు గురయ్యారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వెంగళరెడ్డి కరువుపోయే వరకు వేలాది మందికి అంబలిపోసి ఆదుకున్న మహానుభావుడని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి మద్రాసు గవర్నర్ విక్టోరియా మహారాణి బంగారు పతకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారన్నారు. రాయలసీమలో గొప్ప దాతృత్వం ఉన్న వాళ్లు, స్వాతంత్ర్య సమరయోధులు ఎందరో ఉన్నారని తెలిపారు. అలాంటి స్ఫూర్తిదాతల చరిత్రలను వెలుగులోకి తీసుకొచ్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ఎంతో ఉందన్నారు. కర్నూలు సిల్వర్ జూబ్లి కళాశాల సీనియర్ చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రేనాటి సూర్యచంద్రులు వాసికెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం, బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం మరిచిపోరాదన్నారు. ఇలాంటి వారి జీవిత చరిత్రలు, వారు చేసిన త్యాగాలు, సేవలను తెలుసుకోవాలన్నారు. ఇవి సమాజంలో విలువలు పెంచేందుకు దోహదపడతాయన్నారు. కళాశాల ఎకనామిక్స్ విభాగం అద్యాపకులు డాక్టర్ ఎం.గురుమోహన్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ అద్యాపకులు పీవీ సుబ్బారెడ్డి, వేంపల్లె డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాలకొండ గంగాధర్‌లు మాట్లాడుతూ రాయలసీమకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఎంతోమంది త్యాగ్యధనులు మరుగున పడిపోయారని, వారి చరిత్రలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా అవసరమన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కడప రిపోర్టర్ యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు దండా ప్రసాద్‌లు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి జీవితాల గురించి పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. రాయలసీమలోని ఎందరో మహానుభావుల జీవితాలను, ఆనాటి సామాజిక విశేషాలను వెలుగులోకి తెచ్చేందుకు ఇక్కడి విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల చరిత్ర విభాగ అధ్యాపకులు నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సత్య సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల ప్రతిభ రాష్ట్రస్థాయి గుర్తింపు

విశాలాంధ్ర - బద్వేలు : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో, పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయి హయ్యర్ సెకండరీ స్కూల్లో ఆధ్యాత్మిక విభాగం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎగ్జిబిషన్ కార్యక్రమంలో బద్వేలు శ్రీ సత్యసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఎంపికలో చోటు దక్కించుకున్నారు. ఈ విజయంపై పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినులకు ఆశీస్సులు అందజేశారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, భగవాన్ దివ్య కృప ఫలితంగా ఈ గౌరవం లభించిందని పాఠశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అంగరంగ వైభవంగా అవధూత కొండయ్య స్వామి 44వ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని నీళ్ళస్వామి గ్రామం, వూసయ్యగారి ఆశ్రమం, ధరణి తిమ్మాయపల్లె గ్రామం,లో బుధవారం అంగరంగ వైభవంగా అవధూత కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారీ కేకును కొండయ్య స్వామి కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. భక్తులు కొండయ్య స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండయ్య స్వామి మాట్లాడుతూ నా స్వలాభం కోసం ఏమీ లేదు 1998 నుంచి నేను అవధూత కొండయ్య స్వామిగా మారాను మన భారతదేశం బాగుండాలి మోడీ పరిపాలన గాని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన గాని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన మైదుకూరు మున్సిపాలిటీ చైర్మన్ చంద్ర పరిపాలన బాగా ఉండాలని కోరుతున్నాను. ప్రజలు అందరు బాగుండాలని పోలీసు విలేకరులు భక్తులు బాగుండాలని కోరుకుంటున్నాను. నేను పచ్చడి అన్నం తింటాను కటిక నేల మీద పడుకుంటాను ఇక్కడ కార్యక్రమాలు అన్ని భక్తులే ముందుకు వచ్చి వారే చేస్తున్నారు. కొన్నివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్వామి వారి భక్తబృందం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ క్రింది కార్యక్రమములు జరుగును. రాత్రి 9 గంటలకు జబర్దస్త్ 6వ తేదీ రాత్రి 9 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటకం జరుగును కావున భక్తాదులెల్లరూ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందవలసినదిగా కోరుచున్నాము. నిత్య అన్నదానం జరుగును. 6వ తేది రాష్ట్రస్థాయి వృషభరాజములకు బండ లాగు

పోటీలు కలవు. మొదటి బహుమతి రూ. 3,00,000 రెండవ బహుమతి రూ. 2,00,000, 7వ తేది శుక్రవారం వృషభరాజములచే బండలాగు పోటీలు (పెద్ద బండ) మొదటి బహుమతి : రూ. 1,58,118లు రెండవ బహుమతి : రూ. 1,08,118లు మూడవ బహుమతి : రూ. 75,118లు నాల్గవ బహుమతి : రూ. 50,118లు ఐదవ బహుమతి : రూ. 25,118లు 8వ తేది శనివారం వృషభరాజములచే చిన్నబండ పోటీలు పెద్దబండ పోటీ తరువాత చిన్నబండి పోటీలు నిర్వహించబడును. వృషభరాజములచే బండలాగు పోటీలు (చిన్న బండ) మొదటి బహుమతి : రూ. 40,118లు రెండవ బహుమతి : రూ. 30,118లు మూడవ బహుమతి : రూ. 20,118లు నాల్గవ బహుమతి : రూ. 10,118లు ఐదవ బహుమతి : రూ. 5,118లు పెద్దబండకు వచ్చిన కాండ్లు చిన్న బండకు అనుమతించబడవు.

బాలికల ఉన్నత చదువును చదివించాలి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : బాలికలను కుటుంబంలో పురుషులతో పాటు సమానంగా చూసినప్పుడు ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని బాలికలను విద్య వైద్యంలో ముందుకు పంపించాలని బాలికను ఉన్నంత చదువును చదివించాలని అంగన్వాడి సిడిపిఓ, ముంతాజ్ బేగం పేర్కొన్నారు. మండల కేంద్ర పరిధిలోని స్థానిక బాలికలు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని విద్యాశాఖ అధి కారి, పుల్లయ్య అంగన్వాడి సూపర్వైజర్ ప్రత్యూష కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లా డుతూ బాలికలను ఉన్నంత చదువు చదివిం చాలని కుటుంబంలో పురుషులతో పాటు సమానంగా చూడాలని ఆడపిల్లను చదివించి ఉన్నంత విద్యకు పంపించే విధంగా చూడాల న్నారు. అదేవిధంగా బాల్య వివాహాలను అరి కట్టాలని పిల్లలకు చైల్డ్ మ్యారేజ్ న్యూట్రిషన్ సైబర్ నేరాలు, 1098 పైన వ్యాసరచన పోటీలను విద్యార్థులతో చేపట్టారు అందులో భాగంగా విద్యార్థులకు తగిన బహుమతులను వారి

చేతుల మీదగా అందజేసి అనంతరం విద్యార్థులకు బాలికల పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువ శాతం బాల్య వివాహాలను జరుగుతున్నాయని వాటినరికట్టే విధంగా బాలికలు ముందుకు వచ్చి వెంటనే సమాచారాన్ని ఐసిడిసి వారికి స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలను జోపింగా ఉంచుతామని ఎవరైనా ఆ విధంగా ముందుకు రావాలని వారికి సూచించారు అదేవిధంగా మహిళల పట్ల వరకట్న వేధింపులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు రక్షణగా టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేసి సమాచారాన్ని అందించని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

విశాలాంధ్ర -కడప కలెక్టరేట్ : స్థానిక కడప రాయచోటి రింగ్ రోడ్ సమీపంలో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాలలో ప్రముఖ సినీ రచయిత, నిర్మాత,సినీ హీరో,వ్యక్తిత్వ వికాస నిపు ణులు, కే.ప్రదీప్ చేత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థి దశలో పెంపొం దించుకున్న జ్ఞానం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతర్గత క్రమశిక్షణతో పాటు, నీలో గెలవాలని సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. కలలు అందరికీ ఉంటాయి,ప్రతిభ అందరికీ ఉంటుంది,ఉత్సాహం అందరికీ ఉంటుంది కానీ వాటిని పట్టు పట్టి సాధించేవారు కొందరే ఉంటారని అందులో నేను ఉండాలని దృఢ సంకల్పంతో నేటి యువత ఆలోచించాలని ఆయన వివరించారు. అనంతరం కళాశాల అధినేత చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని,దానిని చేరేందుకు పట్టుదలతో చదవాలన్నారు,అనంతరం వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువ ఇంజనీర్ల పాత్ర కీలకమని,ఎంత చదివితే అంత ఫలితం ఉంటుంది అన్నారు. చివరగా కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సును ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని తమ ఆశలను తల్లిదండ్రులు ఆశలను నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి శశి కుమార్ మరియు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహాభారతం వ్యాసభగవానుడు మానవాళికి అమృతం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : అమృత కలశం మహాభారతం వ్యాసభగవానుడు మానవాళికి అందించిన అమృత కలశం అని టీటీడీ ధార్మిక పరిషత్ ఉపన్యాసకులు చాపాడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠం మండలం, గంగిరెడ్డిపల్లె గ్రామం లోని రామాలయం నందు టిటిడి ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మహాభారతం అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ, భారతం రాగద్వేషాలను వర్ణించిందని, సంఘ ధర్మాన్ని తెలుపుతుందని, భారతంలో ఉండేది ఎక్కడైనా ఉంటుందని, ఇందులో లేనిది ఎక్కడా లేదని ఎవరి కర్మ ఫలాలు వాళ్ళు రచించుకోవాలంటే మహాభారతం చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు పర్యవేక్షణలో జరిగింది. అనంతరం భజనలు జరిగాయి. గ్రామస్తులు గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే వైసిపి నాయకులపై కేసులు పెట్టడం కాదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి అంటే వైసీపీ నాయకులపై దాడులు, కేసులు పెట్టడమే నా అని వైసిపి ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు కంచుపాటి బాబు అన్నారు. బుధవారం మాసాపేటలోని వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకుడు సుబ్బరాయుడు అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ వల్ల 27 వ డివిజన్ గౌస్ నగర్ కో ఆప్షన్ మెంబర్ జహీర్ పై దుర్భాషలాడారని తెలిపారు. జహీర్ తో మాట్లాడకపోయినా జహీర్ నన్ను ఎస్సీ పేరుతో దూషించాడని కేసు నమోదు చేయించడం దుర్మార్గమన్నారు. నిజంగా సుబ్బరాయుడుకు దళితులపై ప్రేమే ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కువ శాతం ఎస్సీలు పై దాడులు జరిగాయని, ఎస్సీ యువతపై ఉచ్చ పోసారని ఇవన్నీ సుబ్బరాయుడు కు కనపడలేదా అని దుయ్యబట్టారు. 27 వ డివిజన్ లో ఎక్కువ మంది దళితులు ఉన్నారని అతనిపై కేసు నమోదు అయిందని తెలిసిన వెంటనే ఆ డివిజన్లో ఉన్న దళితులు స్వచ్ఛందంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. జహీర్ కు కుల మత భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తున్న నాయకుడు జహీర్ అన్నారు. ఒకవేళ జహీర్ దళితులపై చిన్నచూపు చూసేవారైతే ఎస్సీలు ఆయన దగ్గరికి వెళ్లేవారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సాయి, ప్రభుదాస్, మాసాపేట ప్రసాద్, అజయ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మనిషికి ఘన నివాళి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ కు చెందిన మై భారత్ కడప ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాయచోటి లో యూనిటీ మార్చ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచ్చేశారు. సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి వల్లనే ఈరోజు అఖండ దేశం ఐకమత్యంగా ఉందని తెలిపారు. నగరం లోని నేతాజీ కూడలి వద్ద మానవహారం చేసి విద్యార్థులందరూ దేశ భక్తి నినాదాలను చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఎన్ రమేష్ నాయుడు, బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్, గణాంకాదికారి ఎం సి బాబు రెడ్డి, వాలంటీర్ల సెలక్షన్ కమిటీ సభ్యులు నరేంద్ర రాజు, గజపతిరాజు, సురేంద్ర రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ చంద్ర శేఖర్, ప్రేమానందం, వేంకటేశ్వర్లు, బాలాజీ, కుమార్ తోపాటు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైకాపా కార్యకర్తలు

విశాలాంధ్ర-గాలివీడు : మండలంలోని గుండ్ల చెరువు పంచాయతీకి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని, నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ కార్యకర్తలు భారీగా టిడిపిలో చేరుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా చేరిన వారందరికీ పార్టీలో తగిన గుర్తింపు కల్పిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు ఉదయ్ కుమార్, నాగేశ్వర్ రావు, ఆంజనేయులుపాల్గొన్నారు.

నిరుద్యోగ ఎస్సీ యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని నిరుద్యోగ ఎస్సీ యువతకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాఎం జి.రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం కల్లెక్టరేట్‌లోని సభా భవన్‌లో నిర్వహించిన యువ పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సుకు ముఖ్య అతిధులుగా మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్, అనిత దీప్తి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాఎం జి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ..ఇప్పటికే వివిధ రంగాలలో ప్రావీణ్యము ఉన్న యువత పరిశ్రమల స్థాపన కోసము మరింత ముందుకు వెళ్లాలన్నారు. అందు కోసము కేంద్ర ప్రభుతము ద్వారా అమలు అవుతున్న రాయితీ పథకాలు సద్వినియోగము చేసుకోవాలన్నారు. ప్రభుత్వము నుండి అందితే ఆర్థిక సహాయాన్ని ప్రణాళిక బద్దముగా ఖర్చు చేసుకొని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెంది ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ ఉపాధి కోసము ఎదురు చూసే యువత స్వయము ఉపాధి వైపు దృష్టి సారించి పరిశ్రమ స్థాపన వ్యాపార రంగాలలో రాణించగలిగితే మరి కొంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిపించగలర న్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్ బాషా గారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రుణాలు అందించడం జరిగింద'న్నారు. ఎస్సీ వర్గాలను ఆర్థికంగా ఎదుగుదలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవా లన్నారు అదేవిధంగా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తిరిగి రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు.ఎల్డీఎం జనార్ధన్ మాటాడుతూపరిశ్రమల శాఖ ద్వారా చిన్న మధ్యతరగతి పరిశ్రమల స్థాపన కోసము కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు రాయితీ అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆర్ ఎం తులసి, డి.డి. హార్టికల్చర్ సతీష్,డి పీఎం ఎల్ హెచ్ రఘునాథరెడ్డి,ఎఫెల్సి వీరప్రసాద్ , సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఎస్సీ మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - సుండుపల్లె : భక్తిశ్రద్ధలతో భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామపంచాయతీ తొగురుపల్లి సమీపంలో పించ నది ఒడ్డున నూతనంగా నిర్మించిన శివాలయంలో గత మూడు రోజులగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహించారు.బుధవారం ఉదయం శివాలయంలో మల్లికార్జున స్వామి (శివలింగాన్ని) ప్రతిష్టించారు. ధ్వజస్తంను ఎంతో భక్తిశ్రద్ధలతో టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి దంపతులు,కుటుంబ సభ్యులు టెంకాయ కొట్టి పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. అనంతరం టిడిపి రాజంపేట ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల నిర్మాణము వలన ప్రజల్లో భక్తి భావం మరింత పెరుగుతుందన్నారు. మండలాన్ని, మూడు రోజులుగా వందలాదిమంది భక్తులకు అన్నదానం. ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డప్ప,మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ బాబు నాయుడు, సింగల్ విండో చైర్మన్ బెల్లాల రమణ, ప్రస్తది ఇంచార్జ్ ఎల్వి రమణ, చంద్రమౌళి,జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, ఆలయ చైర్మన్,నిర్వాహకులు పాల్గొన్నారు.

కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాజంపేట నియోజకవర్గం పరిధిలోని హత్యరాల దేవస్థానం నందు జరిగిన శ్రీశ్రీశ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవమునకు ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరైన రాజంపేట అసెంబ్లీ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కార్తీకమాసం కార్తీక పౌర్ణమి రోజున జరిగే శివపార్వతుల కల్యాణోత్సవంలో ఆలయ వేదమంత్రత్సవాల మధ్య స్వాములవారికి పూజలు అర్చనలు అభిషేకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో హత్యరాల దేవస్థానం చైర్మన్ పూల నాగమణి, నరసింహులు, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఆలయ ఈవో, పూజారులు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన, మైనార్టీలకు అండ

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : దేశంలోని ఏ రాష్ట్రంలో నైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేది ఒక జాతీయ కాంగ్రెస్ పార్టీ నేనని రాయచోటి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పదవి ఇచ్చి మైనార్టీలు ఉండగా నిలిపేందు కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికు వారు కృతజ్ఞతభి వందనములు తెలిపారు. రేపు జరగబోయే బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అమీర్,జిల్లా సెక్రెటరీ ఖాదర్, చిన్నమండెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షబ్బీర్ అలీ ఖాన్ లు పాల్గొన్నారు.

కళాశాలల ప్రవేటీకరణ సిగ్గుచేటు: ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర- మైలవరం : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటని ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంకాలం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామంలో మండల పరిశీలకులు గిరిధర్ రెడ్డితో కలిసి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి నారపురెడ్డి, మోహనరెడ్డి, పెద్దముడియం మండల పరిశీలకులు చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, సోషల్ మీడియా ప్రతినిధి ఓబుల్ రెడ్డి, ప్రసాదరెడ్డి, బ్రహ్మానందరెడ్డి. మోహనరెడ్డి, శేఖర్ రెడ్డి మల్లేశ్వరెడ్డి, ర తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలసిన మిట్స్ చాన్సుల్లర్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్,చాన్సుల్లర్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, అమరావతిలో మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. సమావేశంలో డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి తమ యూనివర్సిటీలో అందిస్తున్న ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల రంగాలలో తమ యూనివర్సిటీ సాధించిన అంశాలను వివరించారు.ఈ సందర్బంగా ఎన్. విజయ భాస్కర్ చౌదరిని అభినందించారు.

ఏఐటీయూసీ శ్రామిక మహిళా పోరం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర -మదనపల్లి : అన్నమయ్య జిల్లాలో మహిళా శ్రామికులు వివిధ రంగాలలో (భవణ నిర్మాణం,కూల పని,ఇంటి పనిమనిషి, వ్యవసాయ కూలీ,కర్మాగారాలలో) పనిచేస్తున్న శ్రామిక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,వారికి సరైన వేతనాలు,మాతృత్వ సెలవులు, భద్రతా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కూటమి ప్రభుత్వం శ్రామిక మహిళా కార్మికులకు సంక్షేమం కోసం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు.బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధంగా శ్రామిక మహిళా పోరం సమావేశం లక్ష్మి దేవి అద్యక్షతన జరిగింది.అనంతరం మదనపల్లి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షురాలు. టి.నాగవేణి,ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లక్ష్మి దేవి,సహాయ కార్యదర్శి యం.పద్మావతి,కోశాధికారి నాగలక్ష్మి ని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల,చిన్నప్ప, లక్ష్మి దేవి,మస్తానమ్మ, పద్మావతి, రేవతి,వెంకటమ్మ,రాధ తదితరులు పాల్గొన్నారు



మొంథాతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సిపిఐ,ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏఐకేఎస్), సిపిఐ బద్వేల్ నియోజకవర్గ సమితి. రైతు సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఎంవి. సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. బాలు, బద్వేల్ నియోజకవర్గ కార్యదర్శి పిడుగు మస్తాన్, పోరుమామిళ్ల మండల కార్యదర్శి రవికుమార్, కేశవ, నాయకులు సఫా, చాంద్ భాషా, విష్ణు, వెంకటసుబ్బయ్య లతో కూడిన బృందం పోరుమామిళ్ల, కాశి నాయన మండలాలలో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పోరుమామిళ్ల మండలం రాజసాహెబ్ పేట,గ్రామానికి చెందిన రైతు కాసిం వల్లి నీట మునిగి కుళ్ళిపోయిన పసుపు పంటను , వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను, రంగసముద్రం పంచాయతీలో గుర్రప్ప గారి పల్లె గ్రామానికి చెందిన, పోరుమామిళ్ల కిషోర్ కు చెందిన రోడ్డుపై గుర్రప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆరబెట్టుకొని అమ్మేందుకు సిద్ధంగా ఉన్నా 170 క్వింటాలకు గాను 70 క్వింటాలు మొక్కజొన్న విత్తనాలు సగిలేరు నదిలోకి కొట్టుకొని పోవడం జరిగింది. కాశి నాయన మండలం ఆనం వారి పల్లె, చిన్నాయ పల్లె, బసనపల్లె సావిశెట్టిపల్లి ,గ్రామాలలో మొంత తుపాను వలన కురిసిన వర్షానికి దెబ్బతిన్న అరటి, పత్తి, కె.పి. ఉల్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి. సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. బాలు లు మాట్లాడుతూ మొంతా తుఫాను వలన కురిసిన వర్షానికి అరటి చెట్లు నేలకు పడిపోవడం జరిగిందన్నారు. విరిగిన పత్తి వర్షానికి గూడు కట్టుకొని పోయి రంగు మారి పనికి రాకుండా పోయిందని, పత్తి చేలు కూడా అధిక వర్షానికి దెబ్బ తినడం జరిగిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పోరాటాలకు, ఆందోళనలకు సిద్ధమని హెచ్చరిస్తూ వారు మాట్లాడారు.

ఆదిత్యలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

విశాలాంధ్ర-మదనపల్లె: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మదనపల్లె,ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ దృష్టి హాస్పిటల్, మదనపల్లె సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. వంశీదర్ రెడ్డి మాట్లాడుతూ యువతలో కంటి సంరక్షణ పట్ల అవగాహన పెంచడం చాలా అవసరం అన్నారు . నేత్ర ఆరోగ్యంపై చిన్న జాగ్రత్తలు కూడా పెద్ద సమస్యలను నివారించగలవు" అన్నారు. మాట్లాడుతూ, "విద్యార్థులు తమ ఆరోగ్యంపై, ముఖ్యంగా నేత్ర ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. ఈ తరహా సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయి" అన్నారు. ఈ శిబిరంలో 220 మంది అతను మరియు విద్యార్థులు తమ నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అందులో 50 మంది విద్యార్థులకు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాయుడు మేనేజర్ ఎమ్మానుయేల్ హెజ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ టి అమర్నాథ్ రెడ్డి, అధ్యాపకుడు ఈశ్వర్ రెడ్డి, కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

విశాలాంధ్ర- పీలేరు : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని గజమాలతో సన్మా నించి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.నాయకులు మంత్రి దృష్టికి పాఠశాలలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, పిఎఫ్ సమస్యలు, టెట్ అర్హత, పాత డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు వంటి అంశాలను తీసుకువచ్చారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం చురుకైన చర్యలు తీసు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి.వి. రమణ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, డి.సి.ఈ.బి కార్యదర్శి తాటీపర్తి గంగాధర్, హెచ్.ఎం అసోసియేషన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి వై.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంఖుస్థాపన

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు పట్టణంలోని ఎస్.కే.డి నగర్ లో రూ.15లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంఖుస్థాపనతో పాటు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించినట్లు పీలేరు టీడీపీ సీనియర్ నాయకులు, యూనిట్ ఇంచార్జీ పోలిశెట్టి సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినఎస్.కే.డి నగర్‌లో సుధీర్ఘ కాలంగా ఉన్న రోడ్డు సమస్యను పీలేరు శాసన సభ్యులు దృష్టికి తీసుకొని వెళ్లారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవెంటనే సీసీ.రోడ్డు వేద్దామని హామీ ఇచ్చారన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఎస్ కే డి నగర్ చిత్తూరు రోడ్డు మార్గం నుండి ఆర్టీసీ నల్లగుట్టతో పాటు సంత గేటు వరకు రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు బుధవారం నుండి ప్రారంభం మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవి రెడ్డి రమణారెడ్డి, శ్రీనాథ్ క్రాంతి రమాదేవి చంద్రకళ చంద్రమ్మ కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లె పట్టణం, కజిన్స్ వీధిలోని జీయాన్ ఈఎన్టీ పాయింట్‌లో ఈనెల 7న శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ డిసిహెచ్ఎస్, ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ పాల్ రవి కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కజిన్స్ స్ట్రీట్‌లోని జియాన్ ఈఎన్టి పాయింట్‌లో డాక్టర్ పాల్ రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా తమ సోదరి, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పట్టణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కావున ఈ సదవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయితీ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

విశాలాంధ్ర-పెద్దతిప్ప సముద్రం: రానున్న పంచాయతీ ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ స్టేట్ కోఆరి నేటర్ గోపాల్ రెడ్డి అన్నాడు. స్థానిక రామాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు కొత్తకోట శ్రీకాంత్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, అలాగే త్వరలో జరగబో యే ఎన్నికలలో అభ్యర్థులను ఎన్నుకోవడం వారి గెలుపుకు కార్యకర్తలు అండగా ఉండాలన్నాడు. ఈ కార్యక్రమంలో వెంకట నారాయణ, మల్లెం శివయ్య, గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి, రామచంద్ర, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం పూజలు

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: స్థానిక విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సేవకుడు పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణ స్వామి వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులు దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

10న స్థానిక సమస్యలపై కడప కార్పొరేషన్ వద్ద సిపిఐ ఆందోళన

విశాలాంధ్ర-కడప రూరల్ : ఏళ్ల తరబడి భగత్ సింగ్ నగర్ లో సరైన రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు, లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని సిపిఐ కడప నగర సహాయ కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ కడప నగర సహాయ కార్యదర్శి ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ నగర వెస్ట్ జోన్ పరిధిలోని 45వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ మౌలిక స్థానిక సమస్యలను పరిశీలించారన్నారు. పేద,మధ్యతరగతి వర్గాల నివసిస్తున్న కాలనీల పట్ల కార్పొరేషన్ అధికారపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నీళ్లు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, స్మశాన, పారిశుద్ధ్య తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఏళ్ల తరబడి కార్పొరేషన్ ను, డివిజన్లను ఏలిన వారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భగత్ సింగ్ నగర్‌లో మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు తాగునీరు వాటర్ ట్యాంకు కనెక్షన్ లేదన్నారు. ఏళ్ల తరబడి భగత్ సింగ్ నగర్ లో సరైన రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు, లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ తదితర అల్పసంఖ్యాక వర్గాల పేదలు నివసిస్తున్న మురికివాడ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. మురికి నీరు ఇళ్లల్లోకి చేరి

నడవడానికి వీలు లేక కాళ్లకు బొక్కలు బడి అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నటువంటి దౌర్భాగ పరిస్థితి భగత్ సింగ్ నగర్ ప్రజలది పరిస్థితి అన్నారు. కార్పోరేషన్ యంత్రాంగానికి పన్నుల వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ పేదల నివాస ప్రాంతాల అభివృద్ధిపై లేదన్నారు. నవంబర్ 10 తారీఖున సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో వెస్ట్ జోన్ పరిధిలోని ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సౌత్ జోన్ కార్యదర్శి పగడపూల మల్లికార్జున, భగత్ సింగ్ నగర్ శాఖ కార్యదర్శి దేవి, నాయకులు భూదేవి, శ్రీను, రెడ్డమ్మ, రామా దేవి, మక్బూల్ ప్యారి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మండల నేతలు

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులను ఆ పార్టీ మండల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.టి.సదుం గ్రామంలో ప్రభుత్వ భూములు గుర్తించి ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని ఆయనని కోరినట్లు వారు తెలిపారు. మండలానికి టి. సదుం కర్ణాటక సరిహద్దు గ్రామం. ఇక్కడి నుండి బెంగళూరు 80 కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఇచ్చినట్లయితే మా ప్రాంతం అభివృద్ధి అవుతుందని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన పల్లా శ్రీనివాస్ సమస్యను ముఖ్య మంత్రి దృష్టికి అలాగే మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లి మీ ప్రాంతానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు పట్టా చంద్రమోహన్ రెడ్డి, అంకిరెడ్డిపల్లి రమేష్ రెడ్డి, రేకలగుంటపల్లి రాజారెడ్డి, అనంతపురం సుబ్బిరెడ్డి, పెద్ద పొంగుపల్లి ఆంజనేయ రెడ్డి, మల్లెల వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర-కలికిరి : రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలని తాసిల్దార్ హరికుమార్ సూచించారు. మండలంలోని పతేగడ పంచాయతీలోని నగిరిపల్లి, పాలెంలో 20, 22, 23 రేషన్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం స్టాకును తనిఖీ నిర్వహించి, ధరలు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించి అర్హులందరికీ బియ్యం అందేటట్లు చూడాలని, తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దశరథ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పొదుగు వాపు వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: పశువుల పొదుగు వాపు వ్యాధి, దూడల పెంపకం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బుర్లపల్లి, పోతుపేట గ్రామాలలో పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ తిరుపతి ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. పోతుపేట సర్పంచ్ కొండ కళావతి చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భకోస వ్యాధులు, చూలు కట్టని ఆవులు, పరీక్షించి చికిత్సలు చేశారు. 175 పశువులకు పిడుదులు నట్టల నివారణ మందులను, మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూర్లపల్లి సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కూటం ఈశ్వరప్ప, మధుకర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస నాయుడు, డాక్టర్ కళ్యాణ్ వెంకటేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

11న ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రభుత్వ మెడికల్ కళాశా లలను ప్రైవేటు రంగం చేతుల్లోకి అప్పగించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 11న రాయచోటిలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 11వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రాయచోటి పట్టణం చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు నుంచి ఆర్ డిఓ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ చేపట్టి, తదనంతరం ఆర్‌డీఓకు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలు ప్రజలు, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ విభాగాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

పీలేరు రెవిన్యూ డివిజన్ కోసం మంత్రి నారా లోకేష్‌కు వినతి

విశాలాంధ్ర- పీలేరు : మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిన్న జరిగిన "ప్రజా దర్బార్" లో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు మంత్రి లోకేష్ కు వినతి పత్రం సమర్పించి, ప్రజల సౌకర్యం కోసం – పరిపాలనా సౌలభ్యం కోసం.. పీలేరు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ దీనిపై చర్చించి, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర నేత పాలకుంట శ్రీనివాసులు మీడియా కు తెలిపారు. మంత్రి లోకేష్ ను కలిసిన వారిలో పాలకుంట శ్రీనివాసులుతో పాటు పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ నడిమికండ్రిగ సుధాకర్ బాబు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ,కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బ శ్రీకాంత్, డిబిఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాష్ తదితరులు వున్నారు.

కార్తీక పౌర్ణమి పూజలు జరుపుకున్న భక్తులు

విశాలాంధ్ర- కలికిరి: శ్రీ ప్రసన్న పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవాలయం కలికిరి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని స్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, ధ్వజస్తంభానికి కవచ సంప్రోక్షణ వృద్ర హెూమం చేయించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ కార్తీక దీపోత్సవం జ్వాలతోరణం నిర్వహించారు.

ఎపి బేస్ బాల్ పోటీలకు గ్రౌండ్ సిద్ధం చేస్తున్న పిడి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలోని కె.బుడుగుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు ఎస్‌జిఎఫ్ అండర్ 19 వైయస్సార్ కడప స్కూల్ గేమ్స్ ఆర్గనైజేషన్ లో రాష్ట్ర బేస్ బాల్ టోర్నమెంట్స్ జరుగు తాయని వైయస్సార్ కడప స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డివిఇఓ టిఎన్ వి వెంకటేశ్వర్లు,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోధర,కడప జిల్లా అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్ రాజు బుధవారం పాత్రికేయులకు తెలిపారు.అందులో భాగంగానే క్రీడా మైదానంలోని పిచ్చి మొక్కలను తొలగించి గ్రౌండ్ ను చదును చేసి బేస్ బాల్ పోటీలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోని 13 జిల్లాలకు సంబంధించిన బాల,బాలికలు సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించ నున్నారన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కార్తీక పౌర్ణమి శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-రాయచోటి: కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని రాయ చోటిలో ఉన్న శైవ క్షేత్రాలు శంభో శివ శంభో అంటూ భక్తులతో పోటెక్కాయి. పట్టణంలోని శివ నంది సర్కిల్ శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని కార్తీక దీపం వెలిగించారు. ఆలయంలోనే కాకుండా ఆలయం ముందు ప్రధాన రహదారిపై మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి పూజల నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధాన అర్చకులు నటరాజు స్వామి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పర్యవేక్షకులు మానవతా సంస్థ చైర్మన్, ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, సీనియర్ బిజెపి సీనియర్ నాయకులు అరమాటి శివగంగి రెడ్డి పేర్కొన్నారు.

కార్తీక పౌర్ణమి వేళ..

నిండు మనసుతో వెలిగిన ఆధ్యాత్మిక భక్తి జ్వాల...

విశాలాంధ్ర-పులివెందుల: కార్తీక మాసం భక్తి, నియమాచరణ, ఆచారాల సమ్మేళనం. ఈ మాసంలో ప్రతి రోజు ప్రాముఖ్యత కలిగినదే అయినా, కార్తీక పౌర్ణమి మాత్రం ఆధ్యాత్మిక పరంగా విశిష్ట స్థానం దక్కించుకుంది. ఈ రోజు అటు భక్తికి, ఇటు ప్రకాశానికి ప్రతీకగా నిలుస్తుంది.

దీపాల వెలుగులో భక్తి జ్వాల

పౌర్ణమి రాత్రి చందమామ తన పూర్ణ కాంతిని వెదజల్లుతుంటే, భూమిపై శివాలయాలు దీపాలతో దివ్యంగా మిలమిలలాడాయి, సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత మహిళలు కుటుంబ సమేతంగా ఆలయాల వద్ద దీపాలు వెలిగించి దేవుని దర్శించుకున్నారు. ఒక దీపం వెలిగిస్తే పాపం తొలుగుతుంది, వంద దీపాలు వెలిగిస్తే పుణ్యం పెరుగుతుంది" అన్న విశ్వాసంతో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు.

మహిళల భక్తి పోటీలు

ఇటీవల సంవత్సరాల్లో దీపోత్సవం ఒక ఆధ్యాత్మిక సత్సంగంగా మారింది. ఆలయ ప్రాంగణాల్లో దీపాల వరుసలు క్రమబద్ధంగా వెలిగించి భక్తులు కళాత్మకంగా అలంకరిస్తారు. మహిళలు దీపాల రూపకల్పనలో తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ లి"దీపాల మైదానం"లిలా తీర్చిదిద్దారు.

శివాలయాల దివ్య కాంతి

పౌర్ణమి రోజున శివాలయాల చుట్టూ దివ్య కాంతి పరుస్తుంది. గోపురాలు, ప్రాకారాలు, మండపాలు అంతా దీపాలతో మెరుస్తుంటాయి. భక్తుల నినాదాలు, హారతుల ఘోషతో వాతావరణం ఆధ్యాత్మికంగా మారుతుంది. ఈ రోజు గంగాస్నానం చేసిన పుణ్యం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఆధ్యాత్మికతలో ఐక్యత

కార్తీక పౌర్ణమి కేవలం ఒక పండుగ కాదు ు అది "వెలుగుతో జీవితం కూడా ప్రకాశించాలని" చెప్పే సార్థక సందేశం. ఈ సందర్భంగా వెలిగే ప్రతి దీపం మనసులోని అజ్ఞానాంధకారాన్ని తొలగించే జ్ఞానజ్యోతి కావాలని భక్తులు ప్రార్థించారు.

ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు మండలం పత్రం పల్లె గ్రామంలో శ్రీరామ అలాగే గంగమ్మ ఆలయాల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి ఈ నిర్మాణాలను శాస్త్రవేత్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తొండూరు మండల ఇన్చార్జ్ శివ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భైరవుడికి ఎమ్మెల్సీ సతీమణి పూజలు

విశాలాంధ్ర-పులివెందుల: వేముల మండలం నల్లచెరువుపల్లె సమీపంలో మోహనగిరిపై వెలసిన మోపూరు భైరవక్షేత్రంలో వెలసిన కాల భైరవుడికి బుధవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి పూజలు నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పురాతన చరిత్రను అక్కడి పూజారులను అడిగి తెలుసుకున్నారు. ఉమాదేవి మాట్లాడుతూ ఆలయ ప్రాకారాలను బట్టి 14వ శతాబ్దంలో వినుగొండ వల్లభరాయుల కాలంలో నిర్మించినట్లు అక్కడి శాసనాలు చెబుతున్నాయన్నారు. భైరవుడి ప్రాశస్త్యం అద్భుతంగా ఉందన్నారు. పురాతనకాలం నాటి ఆలయంలో కార్తీకమాసోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

పుస్తకాల అప్పగింత

విశాలాంధ్ర-పులివెందుల: కోటి సంతకాల సేకరణ పూర్తయిన సందర్భంగా ఆ పుస్తకాలను బుధవారం వైసిపి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డికి అప్పగించి నట్లు కౌన్సిలర్ లక్ష్మీభార్గవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో పూర్తయిన వైద్య కళాశాలలను కొనసాగించకుండా ప్రైవేటీకరణ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు తాను తన వార్డు పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తిచేశానన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారని భార్గవి తెలిపారు. ఈ కోటి సంతకాల ఉద్యమంతో చంద్రబాబు ప్రభుత్వ కలగాలని ఆమె హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామసుబ్బయ్య, రమేష్, సోమశేఖర్, దాసు, చందు, అరుణ్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, నాని పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన

ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి

-ఇల్లు లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు -కూటమి నాయకులైన ముందుకు వచ్చి పూర్తి చేయించాలి

-పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇల్లు లేని నిరుపేదల కోసం ఇల్లు నిర్మించేందుకు జగనన్న కాలనీ లో 8000 వేల పైచిలుకు ఇండ్లను శాంక్షన్ చేసి నిర్మాణం చేపట్టడం జరిగిందని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మూలం ధ్రువ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి జగనన్న కాలనీలోని ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండ్లను కూటమి నాయకులు ముందుకు వచ్చి వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఇండ్లు లేక చాలామంది బాడుగలు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కాలనీలో కొన్ని రూములకు స్లాబ్ లేవారని, మరి కొన్ని రూములకు గోడల వరకే నిలిచిపోయాయని, మరి కొంతమందికి సంబంధించిన స్థలాల్లో బేస్మటాలు మాత్రమే వేయడం జరిగిందన్నారు. మరి కొంతమందికి సంబంధించిన స్థలాలలో వారికి కేటాయించిన నెంబర్ రాళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయన్నారు. ఇన్ని వేల ఇళ్లను గత ప్రభుత్వంలో గుత్తేదారులు నిర్మించలేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ముందుకొచ్చి అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండ్లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తే ప్రజల జీవితాంతం తలుచుకుంటూ ఉంటారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ముందుకు వచ్చి అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండలాధ్యక్షులు భోనాల ఖాదర్ వల్లి, పులివెందుల మండలాధ్యక్షులు శివ కళ్యాణ్ రెడ్డి,లింగాల మండలాధ్యక్షులు శివ శంకర్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్, పులివెందుల పట్టణ మహిళా అధ్యక్షులు విజయ,నాయకులు మాబు, బద్రీనాథ్, రాఘవయ్య తుపాకుల సాయి కుమార్ పాల్గొన్నారు

గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-తొండూరు: గ్రామస్థాయి నుండి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు ఈ మేరకు తొండూరు మండలంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామిరెడ్డి ఓబుల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ సూచనతో ప్రతి ఇంటికి తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులతో మాట్లాడాలని చెప్పారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని చెప్పారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిం చేలా చూడాలని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వ అధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో భాజపా స్టేట్ కౌన్సిల్ మెంబర్ రమణారెడ్డి, అప్పయ్య నాయుడు, గోవర్ధన్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని ,రాబోవు రోజులు కాంగ్రెస్ పార్టీవేనని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు.కడప నగరానికి చెందిన అబ్దుల్ రవూఫ్ ఇటీవలనే యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిం చబడ్డాడు. ఈ సందర్భంగా రవూఫ్ ,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజా మైనుద్దీన్ వేంపల్లి లో డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ,చట్టంలోని అంశాలు అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందని అన్నారు. టిడిపి, వైకాపా ,జనసేన పార్టీలు మోడీ చేతిలో కీలుబొమ్మలుగా ఎద్దేవా చేశారు. ఈ పార్టీలను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా ,విభజన చట్టంలోని అంశాలు అమలు కావాలన్నా ,రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలన్నా అది కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. క్రమశిక్షణతో ,అంకితభావంతో ,ఆత్మవిశ్వాసంతో కాంగ్రెస్-ార్టీ అభ్యున్నతి కోసం కృషి చేయాలని తులసి రెడ్డి వారికి హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న ,రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ ,నాగరాజు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎంపీ అవినాష్‌రెడ్డి



విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలోని 20 వార్డులో బేతేలు చర్చి సమీపంలో చిన్న తరుణ్ నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ మంచినీటి శుద్ధి ప్లాంటును బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని తక్కువ ధరకే అందించేందుకే ఈ శుద్ధినీటి ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ సుద్ధినేటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందుగా పెనుగొండ చిన్న తరుణ్ వారికి దుశల వాళ్ళతో పూలహారాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ కోడి రమణ,అర్జున్ రెడ్డి, మాజీ చైర్మన్ రసూల్, వీరారెడ్డి, రవికుమార్, చెన్నకేశవులు తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పరమేశ్వరుడి

అనుగ్రహం కలగాలి: ఎంపీ

విశాలాంధ్ర-పులివెందుల:ప్రతి ఒక్కరికీ పరమేశ్వ రుడి అనుగ్రహం కలగాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాసం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ మిట్ట మల్లేశ్వరస్వామికి అమ్మవారికి కుంకుమార్చన తది తర విశేష పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో భాగంగా తెల్లవారుజామున నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలు బిల్వార్చనలు, భస్మాభి షేకాలు తదితర పూజ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు శివ, రుద్రాల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని గ్రూప్ ఆఫ్ టెంపుల్ చైర్మన్ సుధీకర్ రెడ్డి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వానం మేరకు ఎంపీ అవినాష్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్‌లు హాజర య్యారు. ముందుగా వేద పండితు లచే గజమాల దుశాల్వతో సత్కరించి కుంభ కలశం తోస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించి మిట్ట మల్లేశ్వర స్వామిని దర్శించుకుని అభిషే కాలు విశేష పూజలు నిర్వహించి మిట్టమల్లేశ్వర స్వామి దీవెనలు అందుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ప్రతి ఇంటిలో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో దీప కాంతులతో పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని కోరారు. కార్తీక పౌర్ణమి, చీకటిని తొలగించి, ఆశల వెలుగులను వెలిగించే ఒక అపురూపమైన ఆరాధన అన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, పొట్టిపాటి మాధవాచారి, కాంబోజి మల్లికార్జున ,ఆలయ ఈవో రమణ, కౌన్సిలర్ కోడి రమణ, అంబకపల్లి బాబు, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, జస్వంత్ నాని, వై సి పి నూర్ బాష్ అధ్యక్షుడు ఓ రసూల్, సురేంద్ర రెడ్డి, ఎండోమెంట్ అధికారులు ఆలయ నిర్వాహకులు వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

జిల్లా అడిషినల్ ఎస్పీ ప్రకాష్‌బాబు హెచ్చరిక

విశాలాంధ్ర-చెన్నూరు : ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే అల్లరి మూకలను చెదరగొట్టడానికి పరిస్థితులు ఏవైనా ఎలాంటి సవాళ్లు ఎదురైనా ఎదుర్కొనేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందని అది తెలియజేయడమే మాకు ఆపరేషన్ - మాక్‌డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అడిషినల్ ఎస్పీ ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని పాతబస్టాండు నందు మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాలలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ జనసమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న దానిపై మాకు ఆపరేషన్ -మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైనప్పుడు లేదా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడంలో ఆపరేషన్ -మాక్‌డ్రిల్ తోడ్పడుతుందన్నారు. ఎలాంటి సవాళ్లు, పరిస్థితులు ఎదురైనా సమస్యను పోలీసులు అధిగమిస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్థానిక సీఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేసిన రాష్ట్రటిడిపి నేత

విశాలాంధ్ర -మైలవరం : టిడిపి రాష్ట్ర నేత సూర్య పెద్దిరాజు యాదవ్ సునీత దంపతులు బుధవారం జమ్మలమడుగులోని గాయత్రి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు, పండ్లు పలహారాలు పంపిణీ చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సూర్య దంపతులు మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా కార్తీక మాసం సందర్భంగా మైలవరం మండల కేంద్రంలో ఉన్న రాజా ఫౌండేషన్లో వున్నా అనాథ అభాగ్యులకు ,జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువులో గ్రామంలో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో అనాథలకు మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాలు, వృద్ధులకు సేవ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని ఆగస్తీశ్వర కోనలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాలాభిషేక కార్యక్రమాలను నిర్వహించినట్లు సూర్య దంపతులు తెలిపారు ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సూర్య దంపతులు చేస్తున్న అన్నదానం, చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కుంకుమార్చిన పూజల్లో ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలం కె బుడుగుంటపల్లి గ్రామపంచాయతీ పరిది లోని రాగిచెట్టు శివాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి శుభ సందర్భంగా జరిగిన కుంకుమార్చన పూజలకు ఆలయ కమిటీ వారు, గ్రామ పెద్దలు,నాయకుల ఆహ్వానం మేరకు కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాసోత్సవాలలో శివాలయాలను దర్శించుకోవడం చాలా శ్రేయస్కరం అన్నారు. మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కుంకుమార్చన పూజల్లో మైసూరువారిపల్లి సర్పంచ్ కారుమంచి సంయుక్త, నగిరిపాడు మాజీ సర్పంచ్ కట్టా ఉమాదేవి, బుడుగుంటపల్లి మాజీ ఎంపిటిసి వల్లెపు భారతి, రాహుల్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల శరణ్, యామల శిద్దేశ్వర, తిరుపతి శేఖర్, సుబ్బరామిరెడ్డి, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి: డీఎస్సీ మురళీనాయక్

విశాలాంధ్ర-పులివెందుల: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవచుకోవాలని డీఎస్పీ మురళీనాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. స్పెషల్ క్యాంప్ యూనిట్ ఒకటి కార్యక్రమాల ముగింపు సభ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలలో ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్ల కృషి ప్రశంసనీయమన్నారు. నేటి సమాజం లో స్వార్థం పెరిగిపోయిందని, నేరాలు పెరిగిపోయాయని, వాటి అన్నింటిపై అవగాహన కలిగి ప్రజలను చైతన్యవంతులు చేయడంలో విద్యావంతుల పాత్ర,బాధ్యత ఉందన్నారు. స్పెషల్ క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులను, కో ఆర్డినేటర్, ట్రైనర్లను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనిత, జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి పి. సనావుల్లా ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం

క్యాంప్ సర్టిఫికేట్ పత్రాల బహుకరణ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా మాట్లాడుతూ గెలుపు నీ లక్ష్యమైతే ప్రపంచం కూడా నీ ముందు తలవంచుతుందన్నారు. ఆడపిల్ల అంటే బలహీనత కాదని, ధైర్యానికి పట్టుదలకు నిర్వచనమని, లక్ష్యానికి కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. శ్రీనిత మాట్లాడుతూ మనము నిలబడే ప్రదేశం చిన్నదైనా మనస్ఫూర్తిగా ఆకాశాన్ని తాకాలని, ఆడపిల్లలు తమ ప్రతిభతో ఇంటిని వెలిగించగలదని, తన పట్టుదలతో ప్రపంచాన్ని జయించగలరన్నారు. అలాగే వాలంటీర్లను ఉద్దేశించి సమాజానికి సేవ చేయడంతో పాటు విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ సర్టిఫికెట్స్ బహుకరించారు. క్యాంప్‌లో విద్యార్థినిలు నృత్యాలతో, పాటలు, ప్రసంగాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాల నారాయణ, ప్రధానోపాధ్యాయులు బి. సుధాకర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, యూనస్, శ్రీనిసులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్ స్థల హద్దులు ధ్రువీకరించండి:

అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-సిద్ధవటం : మండలంలోని మాధవరం 1 గ్రామం ఎస్‌కే ఆర్ నగర్‌లో బుధవారం చేనేత జోలి అసిస్టెంట్ డైరెక్టర్ పిచ్చేశ్వర్ రెడ్డి పర్యటించి చేనేత సమస్యలపై వివరాలు సేకరించారు. చేనేత కార్మికులు చేనేత క్లస్టర్ సంబంధించి స్థల హద్దులు ధ్రువీకరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్వో కేశవులు మాట్లాడుతూ చేనేత కార్మికుల క్లస్టర్ సంబంధించి స్థల హద్దులు ఏర్పాటు కొరకు వినతి పత్రం సమర్పించారని మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు దృష్టికి తీసుకెళ్లి స్థల హద్దులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానకి రామయ్య, జింక శ్రీనివాసులు, ఆంజనేయులు, ఎస్ వెంకటసుబ్బయ్య, ముని చంద్ర, చేనేత కార్మికుల పాల్గొన్నారు.

గ్రామదేవతలకు అభిషేకం పూజలు

విశాలాంధ్ర - సుండుపల్లె : మాచిరెడ్డిగారి పల్లి గ్రామపంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడి కాలువ గట్టుపై వెలసిన మారెమ్మ తల్లి,కాళికాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామ స్తులు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మ వారికి పట్టు వస్త్రాలను సమర్పించినట్లు తెలిపారు. అనంతరం మారెమ్మ తల్లి కాళికాదేవిలకు అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారన్నారు. ఆలయ ప్రాంగణంలోని సేవాలాల్ మహారాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా హోరెత్తిన శివాలయాలు

విశాలాంధ్ర-సిద్ధవటం : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రమైన సిద్ధవటంపెన్నా నదిలో వేకువ జామున నుండి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వదిలారు శివ క్షేత్రాలు హోరెత్తాయి సిద్ధవటం మండలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వేకువ జామునే, అట్లూరు, ఒంటిమిట్ట, మాధవరం, సిద్ధవటం, భాకరాపేట, పార్వతీపురం, పలు గ్రామాల మహిళలు వేకువ జామునే తండోప తండాలుగా పెన్నా నది వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు పెన్నా నదిలో వదిలి తమ భక్తిని చాటుకున్నారు భక్తుల రద్దీ పెరగడంతో సిద్ధవటేశ్వర, నీలకంఠేశ్వర, సిద్దేశ్వర శివాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి అందులో భాగంగా నీలకంఠేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామస్వామి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధార, జిలకర బెల్లం, మాంగల్య ధారణ, బ్రహ్మ ముళ్ళు, వంటి పూజా కార్యక్రమాలు చేసి శివపార్వతులకు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య, కళ్యాణం వైభవంగా జరిపామని కళ్యాణం తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు ఆలయ ట్రస్ట్ అధినేత బాబు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కడప పెద్ద దర్గా అభివృద్ధి జగన్ ప్రభుత్వమే చేసింది : మైనార్టీ కార్పొరేటర్లు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని పెద్ద దర్గా అభివృద్ధి అనేది మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అని వైసీపి మైనార్టీ కార్పొరేటర్లు ఆరోపించారు. బుధవారం సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీ కార్పొరేటర్లు కడప పెద్ద దర్గాకు అప్పుడున్న ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ భాష, మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో పెద్ద దర్గాకు కావలసిన అన్ని సౌకర్యాలను అభివృద్ధి కార్యక్రమాలను దగ్గరుండి చేయించారని జగన్మోహన్ రెడ్డికి పెద్ద దర్గా పై అనేకమైన నమ్మకమని వారు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర ముగించుకొని మొదట తిరుపతికి వెళ్లి తర్వాత పెద్ద దర్గాకు వచ్చారని ప్రమాణ స్వీకారం రోజు కూడా పెద్ద దర్గాను సందర్శించుకుని వెళ్లారని పెద్ద దర్గపై అంత భక్తి భావం వున్న జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈరోజు మనం చూస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు జగన్‌వల్లే జరిగాయని తెలిపారు. ముఖ్యంగా పేదలైన ఇమాములకు పింఛన్లు అందించడం, దుల్హాన్ పథకం అందించడం, కార్పొరేషన్ ద్వారా సీకే దీన్నే వద్ద ఎనిమిదిన్నర ఎకరాలు స్మశానానికి అప్పగించడం, నగరంలో వెడల్పైన రోడ్లను లైటింగ్ చెట్లను ఇవన్నీ చేసినవని వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. నగరంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు టిడిపి మైనార్టీ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం వచ్చే రెండు సంవత్సరాలు కావచ్చునప్పటికీ నగరానికి కనీసం 500 కోట్లు కూడా చేయలేదని ఇప్పుడు చేస్తున్న ప్రతి పని కూడా జగన్ ద్వారా కేటాయించిన నిధులతోనే చేస్తున్నారని అభివృద్ధి అంటే వైసీపి అంకితభావంతో పనిచేస్తుందని కూటమి ప్రభుత్వం రోడ్లకు ప్యాచ్ లు వేసి అభివృద్ధితో మేమే చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. హజ్ హౌస్ కూడా జగన్మోహన్ రెడ్డి వల్లే జిల్లా కలెక్టర్ అకౌంట్లో 10 కోట్ల 25 లక్షలు వేశారని ఆ నిధులను తెప్పించి అభివృద్ధి చేసి చూపించాలని కూటమి ప్రభుత్వము ప్రతి చిన్నదానికి కేసులు పెట్టి భయపట్టడం మంచిది కాదని మేము ఆల్రెడీ బ్యాగులు సర్దుకొని జైలుకు వెళ్లడానికి ఉన్నామని కేసులకు భయపడమని వారు తెలిపారు. కడప ఉరుసు సందర్భంగా కడప మేయర్ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో రూ.6 లక్షల ఖర్చుపెట్టి ఇప్పుడు మనం చూస్తున్న లైటింగ్స్, ప్యాకింగ్స్ గాని జరుగుతున్నాయని కూటమి ప్రభుత్వము ఒక రూపాయి కూడా కడప ఉరుసు కు ఇవ్వలేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్బర్ ఆలీ ,అజ్మతుల్లా ఖాన్ షంషేర్, జమాల్ వల్లి , పవర్అల్తాఫ్, గౌస్ భాష (చాక్లెట్) అరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు.